క్లుప్తంగా

పేదల పాలిట వరం 'ఆరోగ్యశ్రీ '



ఆరోగ్యశ్రీ బ్రోచర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పరిగి: నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం మరింత భరోసా కల్పించిందని పరిగి సర్పంచ్ లక్ష్మీదేవి తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించి, వైద్య చికిత్సల వ్యయ పరిమితిని రూ.25 లక్షలు పెంచిన నేపథ్యంలో స్థానిక సచివాలయం-1లో మంగళవారం వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బందితో ఎంపీడీఓ సరస్వతి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి నేతృత్వంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ బ్రోచర్లను విడుదల చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.వ్రదహట్టి గ్రామంలో మంగళవారం మారెమ్మ, దుర్గమ్మ, కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు నియమ నిష్ఠలతో బియ్యం పిండితో చేసి జ్యోతులను మోసుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



రిటైర్డ్ డీఎస్పీ గిరిధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ గిరిధర్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారని హిందూపురం పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ భవన ప్రెసిడెంట్ పుల్లప్ప, ఆంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఖయుం, సెక్రెటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ

హిందూపురం అర్బన్: మానసిక ప్రశాంతతకు, దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని బీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రమేష్ పేర్కొన్నారు. డిప్లొమా విద్యార్థులకు ఇటీవల అనంతపురంలో పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో బీఐటీ డిప్లొమా విద్యార్థులు సత్తా చాటారన్నారు. అక్మల్ అహ్మద్, వేణుకృష్ణా జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు



మిషన్లను పరిశీలిస్తున్న తూనికలు కొలతల అధికారి శివశంకర్

పెనుకొండ: ప్రభుత్వ చౌకధాన్యపు డిపోల్లో నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతల అధికారి శివశంకర్ హెచ్చరించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మండలంలోని పలు చౌకధాన్యపు డిపోలకు సంబంధించిన మిషన్లను తనిఖీ చేశారు.

లెదర్ పార్కులు ప్రారంభించాలి

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కాని లెదర్ పార్కులు ఎన్నో ఉన్నాయని, వాటిని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం మడకశిరకు వచ్చిన పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌కు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు వినతి పత్రాన్ని సమర్పించారు. లెదర్ పార్కులను ప్రారంభించి చర్మకార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించండి



హెచ్‌బీ మీటర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమ పద్ధతిలో హెచ్‌బీ మీటర్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ మంజువాణి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశపు భవనంలో మంగళవారం ఆమె వైద్య సిబ్బందికి ట్రూ హెచ్‌బీ మీటర్ కంపెనీ తరఫున నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. హెచ్‌బీ మీటర్ వినియోగించే విధానం, వైద్య పరీక్షలు అందించే పద్ధతిపై మంజువాణి అవగాహన కల్పించారు. శ్రీకాంత్ , రేణుకాదేవి, గిరినాథ్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యమైన 'భవిత'

- దివ్యాంగ విద్యార్థుల్లో భరోసా నింపుతున్న భవిత కేంద్రాలు
- ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు
- సాధారణ పిల్లల్లా మార్చేందుకు కృషి



దివ్యాంగ చిన్నారులకు పాఠాలు చెబుతున్న ఐఈఆర్‌పీఎస్



వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు

రొద్దం: పుట్టుకతోనే లోపాలతో జన్మించే శిశువులకే కాదు.. వారి కన్నవారికీ తిప్పలు తప్పవు. శారీరకంగా.. మానసికంగా కుంగిపోతుంటారు. అయితే శారీరక.. మానసిక దివ్యాంగుల్లో భవిత కేంద్రాలు ధైర్యాన్ని పెంపొందిస్తున్నాయి. తోటి పిల్లల్లా ఆడుకుని, స్కూల్‌కి వెళ్లేలా అవకాశం కల్పిస్తున్నాయి. వారిలో మానసికోల్లాసం, ఆత్మస్థైర్యాన్ని నింపి విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అక్షరాలతో పాటు మంచి నడవడిక నేర్పిస్తూ.. వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆటలు, డ్యాన్స్ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

114 మంది చిన్నారులకు...

పెనుకొండ నియోజకవర్గంలో ఐదు భవిత కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 114 మంది దివ్యాంగులైన చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. రొద్దం 20, పరిగి 19, గోరంట్ల 25, సోమందేపల్లి 15, పెనుకొండలో 35 మంది చిన్నారులు శిక్షణ కేంద్రాలకు వస్తున్నారు. రొద్దం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ప్రాంగణంలో 2012లో భవిత కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు ప్రతి బుధవారం శిక్షణ ఇస్తున్నారు. ఇంటి వద్దనే విద్య నేర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. బుద్ధి మాంద్యం, దృష్టి, వినికిడి లోపం ఉన్న చిన్నారులకు స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నేర్పిస్తారు. ఫిజియోథెరపీ ద్వారా వ్యాయామాలు చేయించి వైకల్య నివారణకు కృషి చేస్తున్నారు. ఇందులో ఐఈఆర్‌పీఎస్‌ల కృషి అభినందనీయం. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రవాణ ఖర్చులు కూడా...

భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగ చిన్నారులందరికీ రవాణ ఖర్చుల నిమిత్తం ప్రతి నెలా ప్రభుత్వం రూ.300 అందిస్తోంది. వారి భద్రత కోసం వచ్చే తల్లిదండ్రులకు రూ.250 చొప్పున ఇస్తున్నారు. అలాగే మధ్యాహ్న భోజనం, దుస్తులు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు వంటి ఉపకరణాలు సమకూర్చుతున్నారు. అవసరమైన చిన్నారులకు శస్త్రచికిత్స చేయిస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



దివ్యాంగులైన చిన్నారుల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సాధారణ పిల్లల్లా తెలివితేటలు ఉన్నప్పటికీ వారు ప్రదర్శించలేరు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలల్లో చేరిన విద్యార్థుల మానసికస్థితిని అంచనా వేస్తున్నాం. వారి పనులు వారే చేసుకునేలా తయారు చేస్తాం. - రమేష్, ఫిజియోథెరపిస్టు, రొద్దం

భవితతో సత్ఫలితాలు



ప్రభుత్వం దివ్యాంగ చిన్నారులను సర్వశిక్షా అభయాన్ ద్వారా సాధారణ పిల్లల్లా తీర్చేందుకు ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. ఫిజియోథెరపీ, బ్రెయిలీ లిపి వంటివి సత్ఫలితాలను ఇస్తున్నాయి. తల్లిదండ్రులు దివ్యాంగులైన పిల్లలను తప్పనిసరిగా భవిత కేంద్రాల్లో చేర్పించాలి. - వసంత, నందని ఐఈఆర్‌పీఎస్

రహదారిపైనే పంట నూర్పిడి



రహదారిపైనే ధాన్యాన్ని నిల్వ చేసిన దృశ్యం

పెనుకొండ రూరల్: కొందరు రైతులు రహదారిపై పంట నూర్పిడి పనులు చేస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీడం లేదని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండ పరిధిలోని 44వ జాతీయ రహదారి గుట్టూరు వై జంక్షన్ దగ్గర కొందరు రైతులు పంట నూర్పిడి పనులు చేపడుతున్నారు. రాత్రి వేలల్లో సైతం బస్తాలను అక్కడే ఉంచడంతో అటుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు చర్యలు చేపట్టిన రోడ్డుపై పంట నూర్పిడి చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక

అమరాపురం: మండల కేంద్రంలోని అమరాపురంలో ఆది దిగంబర జైన దేవాలయం ఆవరణలో చిన్న పిల్లలు, పురిటి పిల్లల వైద్యులు దినకర్ వైద్య సేవలను మంగళవారం అందించారు. 50 మంది చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 86 మంది కంటి సమస్యలు ఉన్న వారిని పరీక్షించి 32 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు దినకర్ తెలిపారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: నవరత్నాల సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి పేద , మధ్యతరగతి కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరి కొన్నేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 6వ వార్డు 43వ సచివాలయాల పరిధిలో మంగళవారం పట్టణ ఏ బ్లాక్ కన్వీనర్ సాధిక్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. 6వ వార్డు 43వ సచివాలయం పరిధిలో మొత్తం డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.9.88 కోట్లు ప్రజలకు లబ్ధిచేకూరిందన్నారు.

రాజకీయాలతో సంబంధం లేదు... అర్హతే ప్రామాణికం

సమన్వయకర్త టీఎన్.దీపిక మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. నిత్యం ప్రజల సంక్షేమానికి పాటుపడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి పునాదులు వేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుంటే మన రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచి ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా ఇచ్చారన్నారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు పొందడానికి టీడీపీ నాయకుల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చుకుంటే కానీ సంక్షేమ లబ్ధిచేకూరేది కాదని విమర్శించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పుడా పరిస్థితి లేదని సంక్షేమ పథకాలన్నీ ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

ఎన్నికల సమయంలో వందల కొద్దీ అమలు కాని హామీలు ఇవ్వడం గెలిచిన తర్వాత వాటిని మర్చిపోవడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తానే అంతా చేశానని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేసేందుకు కుటిల ఎత్తులు వేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాటితో పాటు చెప్పని ఎన్నో సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అన్నలా, తమ్ముడిలా, కొడుకులా ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉన్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు రోషన్ అలీ, మల్లికార్జున, నాగేంద్రమ్మ, గిరి, మల్లికార్జున గౌడ్, జయప్ప, బాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూఖ్, వార్డు ఇన్‌చార్జ్ మల్లికా భాను, చాంద్‌బాషా , నాగరాజు, నారాయణ స్వామి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, అబు బకర్, సికందర్, రేష్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

మడకశిరరూరల్: రానున్న రోజుల్లో కూడా ప్రజలకు మరింతగా మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని , వైఎస్సార్‌సీపీ తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. కల్లుమర్రి గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల లబ్ధి పొందిన బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుమర్రి గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా, పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ.28.79 కోట్లకు పైగా లబ్ధిని చేకూరిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా సీఎం వైఎస్ జగన్ విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. కొత్త సంవత్సరం కానుకగా జనవరి నుంచి అవ్వతాతలకు రూ.3 వేలు పింఛన్ ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల నాయకుడు జమ్మానిపల్లి మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, వైస్ ఎంపీపీ మూర్తి, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, వివిధ కమిటీల సభ్యులు రామాంజప్ప, మల్లికార్జునరెడ్డి, బసప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.



కల్లుమర్రిలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

పక్కాగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్

మడకశిర: నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 5 మండలాల తహసీల్దార్లు ముస్తావలి, హసీనా, రమేష్, మహబూబ్ పీరాతో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు, బీఎల్‌ఓలు, ఎన్నికల విభాగం అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యంగా ఓటర్ల జాబితా సవరణపై చర్చించారు. మండలాల వారీగా ఓటరుగా చేరడానికి ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు? ఎంత మంది తొలగింపు కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు? అనే అంశాలపై సబ్ కలెక్టర్ ఆరా తీశారు. సబ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అర్హులను మాత్రమే ఓటర్ల జాబితాల చేర్చాలని కోరారు. అనర్హులను జాబితా నుంచి తొలగించాలని కోరారు. గడువులోగా అర్హులందరూ ఓటర్లుగా చేర్పించాలన్నారు.

హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలి



సోదరభావ పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కుల, మత బేధాలను పక్కనపెట్టి అందరూ సోదరభావంతో మెలగాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం హిందూ, ముస్లిం సోదర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా అధ్యక్షతన స్థానిక జామీయా మసీదు కార్యాలయంలో సోదరభావ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అశ్వాఖుల్లా ఖాన్‌ను బ్రిటీషర్లు ఉరి తీసిన రోజును హిందూ, ముస్లీం సోదర దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం సామాజిక, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కేశవులు, డాక్టర్ వెంకటరమణ, లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, భగీరథి నవీన్‌కు సోదరభావ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో జామియా మసీద్ కమిటీ ముతవల్లీ నూరుల్లా, షబ్బీర్, లతీఫ్ సేట్, అబ్దుల్ సల్లామ్, అర్షద్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండలంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన ఐదు వలంటీర్ పోస్టుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ చిలమత్తూరు-1 సచివాలయ పరిధిలో మూడు, వీరాపురం, కోడూరు పంచాయితీల్లో ఒక్కొటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేపుకోవచ్చన్నారు.

అగళి: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అగళి సచివాలయంలో ఎస్సీ (మహిళ)1, రావుడి సచివాలయంలో ఎస్సీ (మహిళ) 1,(పురుషుడు) ఓసీ 1, బీసీ (మహిళ)1 , ఇనగలూరు సచివాలయంలో బిసీ (మహిళ) 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

సంఘాలను బలోపేతం చేయండి

అమరాపురం: మండలంలోని గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాల బలోపేతానికి గ్రామైక్య సంఘం లీడర్లు, వీఓఏలు కృషి చేయాలని మడకశిర నియోజకవర్గం ఏరియా కోఆర్డీనేటర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని వీఓఏలు, గ్రామైక్య సంఘం లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లోని సభ్యులు ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంకు రుణాలు తీసుకున్న వాటిని సక్రమంగా వాయిదాల ప్రకారం చెల్లించాలన్నారు. ఏపీఎం.తిప్పన్న, సీసీలు, పాల్గొన్నారు.

కందిలో పంట కోత ప్రయోగం

రొద్దం: మండల పరిధిలోని చిన్నమంతూరులో రైతు నాగమ్మ మంగళవారం కంది పంట ప్రయోగాలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పొలంలో కొలతలు వేసి కంది పంట దిగబడి శాతాన్ని గుర్తిస్తామని ఏఈఓ అంజాద్‌భాషా, వీఏఏ శివజ్యోతి తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

హిందూపురం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి త్వరలో నియోజకవర్గంలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి , చౌళూరు మధుమతిరెడ్డి తెలిపారు. మంగళవారం చలివెందుల, కొటిపి గ్రామాల్లో పార్టీ నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు డైరెక్టర్ పోకల అశోక్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఎస్ చంద్రహాస్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.

రేపు పరిగిలో సీఎం బర్త్‌డే వేడుకలు

పరిగి:మండల కేంద్రంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు. ఉచిత వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించండి

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాఠశాల, జవహర్‌లాల్ నెహ్రూ ఉర్దూ పాఠశాల, భవిత కేంద్రం పాఠశాలలకు ఆకతాయిల బెడద ఎక్కువైందని, వారి నుంచి రక్షణ కల్పించాలని ఎంఈఓ గంగప్పను ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. మంగళవారం పాఠశాలలను ఎంఈఓ గంగప్ప పరిశీలించారు.

దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం: హిందూపురం, లేపాక్షి , పరిగి, గోరంట్ల ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానం చేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హిందూపురం బస్టాండ్ వద్ద 2, ఇతర ఖాళీ స్థలాలు 12, పరిగి బస్టాండ్ 1, గోరంట్ల బస్టాండ్ పక్కన అంగళ్లు 2, లేపాక్షి బస్టాండ్ వద్ద 3 ఖాళీస్థలాలను అద్దె ప్రతిపాదిక టెండర్లు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈనెల 27 వరకు హిందూపురం డీఎం కార్యాలయంలో టెండర్ ఫారాలు విక్రయిస్తారన్నారు. భర్తీ చేసిన టెండర్ ఫారాలను పుట్టపర్తి ఆర్టీసీ ఆర్.ఎం కార్యాలయంలో 28న ఉదయం 10 గంటల్లోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్‌బాక్స్ తెరుస్తామన్నారు. టెండర్ ప్రక్రియపై 20న 11 గంటలకు హిందూపురం డీఎం ఆఫీసులో అవగాహన కల్పిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

గుండెపోటుతో యువకుడి మృతి

అగళి: మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన ఈర నాగప్ప పెద్ద కుమారుడు నాగేంద్ర (35) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. మృతుడు నాగేంద్ర తన సొంత ఇంటికి అవసరమైన నల్లబండలను తీసుకువచ్చేందుకు టాటా ఏసీ వాహనం తీసుకుని వెళ్లగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడన్నారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా నాగేంద్ర అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారన్నారు. నాగేంద్ర బేల్దారి పని చేసుకుని జీవనం సాగించేవాడన్నారు. మృతునికి భార్య సవిత, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

హిందూపురం టౌన్: ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని వాసవీ విన్నర్స్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు శేషు, ప్రథమస్ శర్మ, క్రిషాంత్, లోహిత్, అంశ, సుమయబాను, తనిష్క్ తేజ్, షష్మితలు మొదటి స్థానాల్లో గెలపొందారని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



మడకశిర: ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం



రొళ్ల: హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

మడకశిరరూరల్: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల చదువును ప్రోత్సహిస్తోందని ఎంఈఓ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అందించనున్న ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువును మరింతగా ప్రోత్సహించాలనే ట్యాబ్‌లను సరఫరా చేస్తోందని తెలిపారు. గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసి వాటి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు.

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మొదటి విడత కింద హెచ్‌టీ హళ్లి, బీజీ హళ్లి, రత్నగిరి, రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 170 మంది విద్యార్థులకు అందించనున్న ట్యాబ్‌లను హెచ్‌ఎంలకు అందించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మిగిలిన పాఠశాల విద్యార్థులకు త్వరలోనే రెండో విడత కింద ట్యాబ్‌లను పంపిణీ చేస్తామన్నారు.

ఘనంగా పద్యార్చన



కె.శివరం ఉన్నత పాఠశాలలో పద్యార్చన చేస్తున్న విద్యార్థులు

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమ్మ, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం , 100 దేశాల్లో నివాసం ఉంటున్న తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరం పేరుతో చిగురుమల్ల శ్రీనివాస్ 100 దేశాలలో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచంలో 10 లక్షల మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారని కె.శివరం, అమరాపురం ఉన్నత పాఠశాలల నుంచి 300 విద్యార్థులు సామూహికంగా పద్యార్చన చేసినట్లు తెలుగు ఉపాధ్యాయుడు ముద్దరంగప్ప తెలిపారు. హెచ్‌ఎం. శ్రీనాథ్, ఉపాధ్యాయులు రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726